క్లుప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఖాళీ స్థలాల్లో ఆయిల్‌బాల్స్ వేస్తున్న సిబ్బంది

జగిత్యాల: పరిసరాలను ప్రతీ ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ స్పందన అన్నారు. గురువారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా దోమల నివారణ కోసం చర్యలు చేపట్టారు. ప్రతి డ్రెయినేజీల్లో లార్వా వేయడంతో పాటు డ్రెయినేజీల్లో పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం కోసం ప్రతీ ఒక్కరు చర్యలు తీసుకోవాలని ఖాళీ స్థలాల్లో నిలిచిపోయిన నీరుంటే తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ప్రజల్లో అవగాహన కోసమే వాల్ పేయింటింగ్



పేయింటింగ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

మెట్‌పల్లి: ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన పెంచడం కోసమే వాల్ పేయింటింగ్‌ను చేపట్టామని బల్దియా కమిషనర్ మోహన్ అన్నారు. పట్టణంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల గోడలపై పరిశుభ్రత, పచ్చదనం పెంపుతో కలిగే ప్రయోజనాలతో పాటు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ పేయింటింగ్ వేయిస్తున్నారు. దీనిని గురువారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్ పేయింటింగ్ ప్రజలను ఆకట్టుకోవడంతో పాటు అవగాహన కల్పించడానికి దోహదం చేస్తుందన్నారు.

చెత్త సేకరణపై దృష్టి సారించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్ననాయకులు

రాయికల్: పట్టణంలో చెత్త సేకరణపై దృష్టి సారించాలని కోరుతూ బీఆర్‌ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్‌కుమార్ మాట్లాడుతూ, బల్దియాలో చెత్త సేకరణ సరిగా జరగకపోవడంతో వర్షకాలంలో ప్రజలకు వ్యాధులు సంభవిస్తున్నాయని, నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, చెత్త సేకరణ కోసం వాహనాలు కొనుగోలు చేసి పారిశుధ్య కార్మికులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మహేశ్‌గౌడ్, తురగ శ్రీధర్ రెడ్డి, సాయికుమార్, మహేందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మినీ స్టేడియంలో యోగా వాక్



యోగా వాక్ నిర్వహిస్తున్న ఆయుష్ సిబ్బంది

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో గురువారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ డీపీఎం శివకుమార్ మాట్లాడుతూ జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సంలో అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని సూచించారు. యోగాతో మనస్సు ఉల్లాసంగా, ధృడంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఆయుష్ ఫార్మాసిస్ట్ జలేందర్, వాకర్స్ అసోసియేషన్ నాయకులు గౌతమ్ రెడ్డి, ప్రసాద్, కాయితి శ్రీనివాస్, నారాయణ, నర్సింహారెడ్డి, చందు, ప్రమోద్ పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు

జగిత్యాల: ఆరోగ్య సలహదారులు, ల్యాబ్ టెక్నీషియన్‌గా కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసేందుకు ఈనెల 26న డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని, దరఖాస్తు ఫారం, ఇతర వివరాల కోసం jagtial.telangana.gov.in పొందాలని సూచించారు.

ఆయుష్ కేంద్రాల్లో యోగా శిక్షణ

- ఆయుష్ కేంద్రాలకు అనుబంధంగా ఆరోగ్య స్వచ్ఛత కేంద్రాలు
- యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు



శిక్షణ కేంద్రంలో యోగా చేస్తున్న గ్రామీణులు

జగిత్యాలజోన్: ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఆయుర్వేదం, యోగా, ప్రకృతి చికిత్స, యునాని, సిద్ధ, హోమియోపతి వంటి ఆయుష్ వైద్య సేవలకు పూర్వ వైభవం తీసుకవచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఈ మేరకు జిల్లాలోని ఆయుర్వేద, యునాని, హోమియావతి వైద్య శాలలకు పెద్ద పీట వేసేందుకు, వాటికి అనుబంధంగా ఆరోగ్య స్వచ్ఛత కేంద్రాలను ఏర్పాటు చేశాయి. ఇటీవల దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద, యునాని, హోమియో వైద్యంలో పరిష్కారం లభిస్తుండటంతో, చాలా మంది అటు వైపు మళ్లుతున్నారు. దీంతో ఈ ఆసుపత్రులకు డిమాండ్ పెరిగింది. ఈ మేరకు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న ఆయుష్ కేంద్రాల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. జిల్లాలో 'యోగా ఫర్ వన్ ఎర్త్- వన్ హెల్త్' అనే నినాదంతో గత కొద్ది రోజులుగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆయుష్ కేంద్రాల్లో ఆరోగ్య స్వచ్ఛత కేంద్రాలు

జిల్లాలో 13 కేంద్రాల్లో ఇప్పటికే ఆయుష్ సేవలు అందుతున్నాయి. జిల్లాలోని వీవీరావుపేట, వెల్గుల్ల, బండ లింగాపూర్, చిల్వ కోడూర్, ఎండపల్లి, కొడిమ్యాల, మేడిపల్లి, అల్లీపూర్, బతికెపల్లి, ధర్మపురి, కోరుట్ల, లక్ష్మీపూర్, మల్యాల ప్రాంతాల్లో ఆయుర్వేద, హోమియా, యునాని ఆస్పత్రులున్నాయి. వీటికి అనుబంధంగా ఆరోగ్య స్వచ్ఛత కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఒక్కో కేంద్రాన్ని రూ.6 లక్షలతో రేకుల షెడ్డు నిర్మించి సదుపాయాలు కల్పించారు. ఉదయం రైతులకు యోగాపై శిక్షణ ఇవ్వడంతో పాటు సమీపంలోని గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలు, హాస్టళ్లలో యోగా శిక్షణ కార్యక్రమాలను ఆయుష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

యోగా శిక్షణ కార్యక్రమాలు

గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రజలకు యోగాను దగ్గరగా చేస్తున్నారు. వీరికి శిక్షణ ఇచ్చేందుకు ఒక్కో కేంద్రానికి ఇద్దరు శిక్షకులను సైతం నియమించారు. వీరు ప్రతీ రోజు ఉదయం 6–8 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు. ప్రాచీన వైద్య విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కూడా ఈ కేంద్రాలు పనిచేయనున్నాయి.

యోగా జీవితంలో భాగం కావాలి



గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆరోగ్య స్వచ్ఛత కేంద్రాల్లో యోగాపై శిక్షణ ఇస్తున్నాం. చాలా మంది కార్యక్రమానికి రావడమే కాకుండా, యోగా వల్ల కలిగే లాభాల గురించి తెలుసుకుంటున్నారు. యోగాసానాలు చేస్తూ, శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటున్నారు.

– తిరుపతి, యోగా శిక్షకుడు

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



జిల్లాలో ఏర్పాటు చేసిన ఆరోగ్య స్వచ్ఛత కేంద్రాల్లో యోగాను ప్రజలకు తెలియజేసేందుకు, వాటి ద్వారా పరిష్కారం చూపేలా కేంద్రాలు పనిచేస్తున్నాయి. యోగా ద్వారా మానసిక ఒత్తిడిని జయించవచ్చు. ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండేందుకు యోగా పనిచేస్తుంది.

– డాక్టర్ అనితా రెడ్డి, ఆయుష్ నోడల్ ఆఫీసర్

ఆగమేఘాలపై చెత్త తొలగింపు



గంగాపూర్ జీపీ ముందు పేరుకుపోయిన చెత్త

బుగ్గారం: మండలంలోని గంగాపూర్ గ్రామంలో పనిచేస్తున్న పంచాయతీ సెక్రటరీ గత కొంతకాలంగా లీవ్‌లో ఉండడంతో పంచాయతీ కార్యాలయంలో పర్యవేక్షణ కరువైంది. మరో గ్రామ కార్యదర్శికి ఇన్‌చార్జి గా బాధ్యతలు అప్పగించినప్పటికీ గ్రామంలో పారిశుధ్యంపై పర్యవేక్షణ కరువైంది. దీంతో ఆ ప్రాంగణమంతా చెత్తచెదారంతో నిండిపోయింది.పంచాయతీ కార్యాలయం ముందరే పెద్ద ఎత్తున చెత్త పోగవడంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్యాలయంలోని పనికిరాని వస్తువులను,అట్టపెట్టెలను,సంచులను సమీపంలోని ఖాళీ ప్రదేశంలో పడేశారు. ఇదే చెత్తలో జాతీయ జెండాలు పదుల సంఖ్యలో పడేయడం గమనార్హం.

సాక్షి విజిట్‌తో మారిన సీన్..

తమ గ్రామంలో నెలకొన్న సమస్యలపై స్థానికులు సాక్షిని సంప్రదించారు. తక్షణమే పంచాయతీ కార్యాలయాన్ని సాక్షి సందర్శించగా, విషయం తెలుసుకున్న అధికారులు ఆగమేఘాలపై కార్యాలయ ఆవరణతో పాటూ చుట్టు పక్కల పరిసరాలన్నీ యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేయించారు. తాము ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోని అధికారులు సాక్షి పరిశీలనతో కొన్ని గంటల్లోనే సమస్యను పరిష్కరించారని హర్షం వ్యక్తం చేశారు.

నంబరు ప్లేట్ లేని వాహనాలు సీజ్



వాహనాలు తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ సుధాకర్

జగిత్యాలక్రైం: నంబరు ప్లేట్ లేని వాహనాలు రోడ్డుపై తిరిగితే సీజ్ చేసి కఠిన చర్యలు చేపడతామని జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ అన్నారు. గురువారం జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో విస్తృత వాహనాల తనిఖీ చేపట్టారు. నంబరు ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై సదాకర్ పాల్గొన్నారు.

బైక్‌లు పట్టివేత

మెట్‌పల్లి: పట్టణంలోని పోలీస్‌స్టేషన్, పాత బస్టాండ్, ఆర్టీసీ డిపో చౌరస్తా ప్రాంతాల్లో గురువారం సీఐ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ద్విచక్ర వాహనాలను పెద్ద సంఖ్యలో పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో ఎస్సైలు కిరణ్‌కుమార్, రాజు, రాజునాయక్ ఉన్నారు.

ధర్మపురి: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జాతీయ రహదారిపై గురువారం ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై ఉదయ్‌కుమార్ తమ సిబ్బందితో వాహనాలు తనిఖీలు చేపట్టారు. నంబర్ ప్లేట్స్ లేని, బండి కాగితాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనాలను గుర్తించి 11 మంది వాహనదారులకు జరిమానా విధించారు. మైనర్లకు వాహనాలిస్తే వారి తల్లి దండ్రులు బాధ్యులవుతారని మైనర్లు వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఎనీమియాపై అవగాహన కల్పించాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో

జగిత్యాల: సికెల్‌సెల్ ఎనీమియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. గురువారం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రపంచ సికెల్‌సెల్ ఎనీమియా నివారణ దినోత్సవంలో మాట్లాడారు. జన్యు పరమైన వ్యాధి అని, ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. మామూలుగా ఎర్ర రక్తకణాల జీవిత కాలం 100–120 రోజులు ఉంటుందని, సికెల్‌సెల్ ఎనీమియా బాధితుల్లో ఎర్ర రక్తకణాల ఆకారం కొడవలిలాగా వంపు తిరిగి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ సుమన్‌రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: రక్తహీనత నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. గురువారం రాయికల్ పట్టణంలో రక్తహీనతపై ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. రక్తహీనత ఉండటం వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సతీశ్, హెచ్‌ఈవోలు సాగర్‌రావు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సైల బదిలీ

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాలో ఎనిమిది మంది ఎస్సైలను బదిలీచేస్తూ జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల టౌన్ –2గా పనిచేస్తున్న పి.గీత సారంగాపూర్ ఎస్సైగా, ధర్మపురి ఎస్సైగా పనిచేస్తున్న పి.ఉదయ్‌కుమార్‌ను వెల్గటూర్ ఎస్సైగా,కోరుట్ల ఎస్సైగా పనిచేస్తున్న శ్రీకాంత్‌ను డీఎస్‌బీ జగిత్యాలకు, సారంగాపూర్ ఎస్సైగా పనిచేస్తున్న దత్తాత్రిని డీసీఆర్‌బీ జగిత్యాలకు, గొల్లపల్లి ఎస్సైగా పనిచేస్తున్న సీహెచ్.సతీశ్‌ను డీఎస్‌బీ జగిత్యాలకు, వెల్గటూర్ ఎస్సైగా పనిచేస్తున్న ఉమాసాగర్‌ను వీఆర్ జగిత్యాలకు, నిజామాబాద్ జిల్లా నందిపేట ఎస్సైగా పనిచేస్తున్న చిరంజీవిని కోరుట్ల ఎస్సైగా, నిర్మల్ జిల్లా కడెం ఎస్సైగా పనిచేస్తున్న కృష్ణసాగర్ రెడ్డిని గొల్లపల్లి ఎస్సైగా నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

వీధికుక్కల దాడిలో నాటుకోళ్లు మృతి

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేటలో గొడుగు సురేశ్‌కు చెందిన నాటుకోళ్ల ఫామ్‌లో గురువారం వీధి కుక్కలు చొరబడి 31 నాటు కోళ్లను చంపేశాయి. సుమారు రూ. 20 వేల నష్టపోయినట్లు సురేశ్ తెలిపారు. వీధికుక్కల ఆగడాలను అధికారులు అడ్డుకట్ట వేయాలని కోరారు.

ఆలయంలో దొంగతనం

కథలాపూర్: మండలంలోని అంబారిపేట గ్రామ శివారులోని రామాలయంలో దొంగతనం జరిగినట్లు గ్రామస్తులు గురువారం గుర్తించారు. దొంగలు దేవుడి మెడలో ఉన్న రెండు మాసాల బంగారు పుస్తెల తాడు, రెండు తులాల వెండి ఎత్తుకెళ్లారని, హుండీని ఎత్తుకెళ్లి వాగులో పడేసినట్లు గ్రామస్తులు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్సై నవీన్‌కుమార్ పరిశీలించి వివరాలు సేకరించారు.

గుడుంబా విక్రేత అరెస్ట్

వెల్గటూర్: మండలంలోని జగదేవుపేటలో దారంగుల మల్లేష్ అనే వ్యక్తి గుడుంబా విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 20లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అన్నదానం మహాదానం

కోరుట్ల: అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. గురువారం కోరుట్ల సాయిబాబా ఆలయంలో అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ చైర్మన్ బాలె నర్సయ్య, కమిటీ సభ్యులు అల్లె సదాశివ్ సొంతంగా సాయిబాబా ఆలయంలో ప్రతీ గురువారం అన్నదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అన్నం అనిల్, ఎంబేరి నాగభూషణం, ఆలయ కమిటీ సభ్యులు గడ్డం కిరణ్, నేమూరి భూమయ్య, సచిన్ పటేల్, దివాకర్, ఈవో అనిల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠరథం ప్రారంభం



వైకుంఠ రథం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, దాతలు

కోరుట్లరూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ లో గడ్డం సాయిరెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వైకుంఠ రథంను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గురువారం ప్రారంభించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

మల్లాపూర్: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గురువారం మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట, రాఘవపేట గ్రామాలలో ఆయన పర్యాటించి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలిచి ఆదుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గౌరు నాగేష్, దేవ మల్లయ్య, శరత్ గౌడ్ పాల్గొన్నారు.

చెరువులు నింపేందుకు సర్వే

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి గ్రామ శివారులోని పాడి చెరువును నీటితో నింపేందుకు నీటిపారుదల శాఖ అధికారులు గురువారం సర్వే చేపట్టారు. గ్రామశివారులో వరదకాలువ, ఉదకమ్మ చెరువుల కన్నా పాడి చెరువు ఎత్తు ప్రాంతంలో ఉండటంతో పైపులైన్ ద్వారానే నీటిని నింపవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు పైపులైన్ కోసం సర్వే చేపట్టారు. ఉదకమ్మ చెరువు నుంచి పాడి చెరువు వరకు పైపులైన్ వేస్తేనే బాగుంటుందని స్థానిక నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు రాజు, ప్రియతం రాజు, లింగం గౌడ్, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన బడిబాట

ధర్మపురి: బడీడు పిల్లలను బడిలో చేర్పించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన బడిబాట గురువారం నాటితో ముగిసింది. మండలంలోని కమలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంఈవో సీతామహాలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బడిబాటతో గతేడాది కంటే ఈ సారి విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

బుగ్గారం: మండలంలోని గోపులాపూర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఎంఈవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.ఈ సంధర్భంగా సరస్వతీ పూజ నిర్వహించి అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, ప్రవీణ్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

బుగ్గారం: మండలంలోని పలు గ్రామాల లబ్దిదారులకు సీఎంఆర్‌ఎఫ్ పథకం క్రింద మంజూరైన చెక్కులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల సుభాష్ నాయకులు నగునూరి నర్సాగౌడ్,బత్తుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో మాజీమంత్రి పూజలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి, అర్బన్ మండలంలోని హస్నాబాద్ గ్రామాల్లో గురువారం పెద్దమ్మతల్లి బోనాల మహోత్సవంలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జున్ను రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

బోనాల పండగలో ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్: మండలంలోని తాటిపల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పెద్దమ్మతల్లి బోనాల జాతర ఉత్సవాల్లో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ దామోదర్‌రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, నాయకులు రాము, శంకర్, ఆంజనేయులు, గంగాధర్ పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

మల్లాపూర్:మండలంలోని కొత్తదాంరాజుపల్లి కి చెందిన గంగిశెట్టి శ్రీకర్ ఇటీవల ఐఐటీ సీటు పొందగా, మండల కేంద్రంలోని వాసవీకన్యక పరమేశ్వరి ఆలయ ఆవరణలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీకర్, తల్లిదండ్రులు శ్రీకాంత్–శ్రావణిలనుసన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రిజియన్ మాజీ చైర్మన్ శివ శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం మాజీ మండల అధ్యక్షుడు శివ రాంకిషన్, సభ్యులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

మల్యాల: మండల కేంద్రంలోని పద్మశాలీ కల్యాణ మంటపం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పద్మశాలీ సంఘ నాయకులు గురువారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని, నిధులు మంజూరు చేసేందుకు హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో బోడ గోవర్ధన్, తాటిపాముల రాజేందర్, బండారి అశోక్, కట్కం శ్రీనివాస్, కొక్కుల సుధాకర్, పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

మల్యాల: గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని, గర్భిణులకు వైద్య పరీక్షలు చేయడంతోపాటు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని ప్రోగ్రాం ఆఫీసర్ జైపాల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం ఏఎన్‌సీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు హిమోగ్లోబిన్, బీపీ, షుగర్, పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు సకాలంలో పరీక్షలు చేసుకుంటూ ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యురాలు మౌనిక, హెచ్‌ఈవో రమేశ్, పీహెచ్‌ఎన్ నాగలక్ష్మి, సూపర్‌వైజర్ రమణమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పురాతన విగ్రహాలకు ప్రత్యేక పూజలు

గొల్లపల్లి: మండల కేంద్రంలో అంబేడ్కర్ వాడ వాటర్ ట్యాంక్ సమీపంలోని పురాతనమైన విగ్రహాలను గురువారం శుద్ధి చేసి పురోహితులు వేద మంత్రాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కళా భైరవ, వినాయక సమేత స్వయంభు అష్టభుజ దుర్గ అమ్మవారి విగ్రహాలుగా వేద పండితులు గుర్తించారు. స్థల యజమాని పడాల రాజన్న, కుటుంబ సభ్యులు, విశ్వహిందూ పరిషత్ నాయకులు, గ్రామ పెద్దలు, కాలనీ వాసులు , యువకులు, మహిళలు పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు

రేపు ఉచిత వైద్య శిబిరం

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని శ్రీలక్ష్మీనరసింహ ఫంక్షన్‌హాలులో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈనెల 21న జరుగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్టార్ హెల్త్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జగిత్యాల: కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సిరాజోద్దీన్ మే 25న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బలమైన గాయమై కోమాలోకి వెళ్లాడు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. వారి కుటుంబ సభ్యులను అదనపు కలెక్టర్ లత పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఆమె పేర్కొన్నారు. ఆమె వెంట కోరుట్ల ఆర్డీవో, ఏవో ఉన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా కాంతయ్యాచారి

మల్లాపూర్: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా ఇల్లెందుల కాంతయ్యాచారి(కొత్తదాంరాజుపల్లి)ని నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ మేరకు కాంతయ్యాచారికి ఆయన నియామక పత్రాన్ని అందించారు.

ఎరువుల తయారీపై అవగాహన

కోరుట్లటౌన్: పట్టణంలోని కల్లూర్ రోడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ ఆధ్వర్యంలో కంపోస్టు పిట్ ఉపయోగించడం, ఎరువు తయారు చేయడం అనే అంశంపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, పాఠశాల హెచ్.ఎం. కృష్ణమోహన్‌రావు, మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ రాజేంద్రప్రసాద్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మహేష్, ముక్కెర హేమంత్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు..

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ గ్రామంలో 12 రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా గురువారం 'సాక్షి'లో 'కాలిన ట్రాన్స్‌ఫార్మర్' అనే శీర్షికన వార్త ప్రచురితం కాగా, స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు గురువారం ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. దీంతో రైతులు ×సాక్షి×కి కృతజ్ఞతలు తెలిపారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాలరూరల్: భూభారతితో రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ అరుణ్‌కుమార్, ఆర్‌ఐలు భూమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కథలాపూర్: భూ భారతి చట్టంతో రైతుల భూమి సమస్యలు పరిష్కారమవుతాయని కథలాపూర్ తహసీల్దార్ వినోద్ పేర్కొన్నారు. గురువారం కథలాపూర్ మండలం చింతకుంట, భూషణరావుపేట గ్రామాల్లో భూ భారతి చట్టం గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా 1556 దరఖాస్తులు

పెగడపల్లి:మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా వివిధ భూ సమస్యలపై 1556 అర్జీలు స్వీకించినట్లు తహసీల్దార్ రవీందర్ తెలిపారు.

ఇబ్రహీంపట్నం: మండలంలో 17 గ్రామాలలో ఈ నెల 3 నుంచి 19 వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి ముగించారు. మండలంలో 1510 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు.

దివ్యాంగ ఉపకరణాలకు దరఖాస్తుల గడువు పెంపు

జగిత్యాల: దివ్యాంగుల సహాయక ఉపకరణాలు అందించేందుకు గడువు పెంచినట్లు జిల్లా సంక్షేమాధికారి బోనగిరి నరేశ్ తెలిపారు. ఈనెల 18 లోపు గడువు పూర్తయినప్పటికీ మళ్లీ 27 వరకు పొడిగించారని తెలిపారు. అర్హత గల వారు www.tsobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మిగతా వివరాల కోసం 155326 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

సారంగాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కళాశాలకు చేరుకోవడానికి ఆర్టీసీబస్సులు నడపాలని కళాశాల అధ్యాపకులు గురువారం జగిత్యాల ఆర్టీసి డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. గత సంవత్సరం కళాశాల ప్రారంభమైన వెంటనే అప్పటి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సూచనతో రేచపల్లి నుంచి విద్యార్థులు కళాశాలకు చేరుకోవడానికి బస్సులు ఏర్పాటు చేసారని గుర్తు చేశారు. విద్యార్థులకు కళాశాలకు చేరుకోవడానికి రూట్ మ్యాప్ రూపొందించి బస్సులు ఏర్పాటు చేస్తామని డీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పోచమ్మతల్లికి బోనాలు



బోనాలతో వస్తున మహిళలు

రాయికల్: పట్టణంలోని ఒడ్డెరకాలనీ, శాలివాహన సేవా సంఘం ఆధ్వర్యంలో పోచమ్మతల్లికి గురువారం బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ధర్మపురి: మండలంలోని రాయపట్నంలో నల్ల పోశమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా వందలాది మంది మహిళలు బోనాలతో భారీ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. దారి పొడవున ఒగ్గుడోలు నృత్యాలు ఆకట్టుకున్నాయి.